క్లుప్తంగా

అడవులను కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌బీవో సునీల్

కడెం: అడవులను కాపాడుకోవాలని ఉడుంపూర్ అటవీ రేంజ్ ఎఫ్‌బీవో సునీల్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని మిద్దెచింత గ్రామంలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చెట్లు కాలిపోతే వన్యప్రాణుల ప్రాణాలకు కలిగే ముప్పును వివరించారు. ఇందులో వార్డు సభ్యుడు ఆత్రం మాణిక్‌రావు, గ్రామస్తులు, అటవీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

భీం విగ్రహావిష్కరణ



విగ్రహం వద్ద సర్పంచ్ కృష్ణారెడ్డి, సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామంలో సోమవారం సర్పంచ్ కృష్ణారెడ్డి కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహదాత అయిన సర్పంచ్ సొంతంగా రూ.లక్ష వెచ్చించి గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. భీం పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగన్న, మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవి, వీడీసీ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతి అందిస్తున్న అధికారులు, నేతలు

పెంబి: మండల కేంద్రంలో పెండల సురేశ్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. సోమవారం పెంబి, దస్తురాబాద్ జట్లకు ఫైనల్ మ్యాచ్ జరుగగా దస్తురాబాద్ జట్టు విజేతగా.. రన్నరప్‌గా పెంబి జట్టు నిలిచింది. విజేతకు రూ.20వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.10వేలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మస్కాపూర్ పాఠశాలలో ఆటలపోటీలు



పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈనెల 26న విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని హెచ్‌ఎం నరెందర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, శ్రీనివాస్, శేఖర్, మారుతి, స్వప్న, అంజయ్య, తదితరులు ఉన్నారు.

కంకాళమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: జన్నారం మండలం వీరగుట్టపై ఈనెల 28న నిర్వహించే కేతేశ్వర కంకాళమ్మ జాతర పోస్టర్‌ను సోమవారం ఖానాపూర్‌లో నాయకులు ఆవిష్కరించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాల ఆహ్వానపత్రిక అందించి కరపత్రాలను ఆవిష్కరించారు. దశమ వార్షికోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నర్సయ్య, లింగన్న, చిన్నయ్య, ఎర్రన్న, రమేశ్, వెంకటేశ్, రవి తదితరులు ఉన్నారు.

భవానీనగర్ నూతన కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలోని న్యూపోస్టాఫీస్ ప్రాంతంలో ఉన్న భవానీనగర్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా వినోద్ పటేల్ భవాని, ఉపాధ్యక్షులుగా బత్తుల్‌వార్ రవి, ప్రధాన కార్యదర్శిగా ఆసంవార్ ప్రకాశ్, కోశాధికారిగా బత్తుల్‌వార్ సుదర్శన్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గం శ్రీరాముడి చిత్రపటానికి పూజలు చేశారు.

జగమంతా రామమయం

అయోధ్యలో శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో యువకులు బైక్‌లతో ర్యాలీగా వెళ్లి రామాలయం, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు రాముడి గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. శ్రీరామ జయరామ జయజయరామ అంటూ భజనలు చేశారు. పలు ఆలయాల ఆవరణలో భక్తులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వీక్షించేలా ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ప్రతి ఒక్కరూ తమ ఇంటిని మామిడి తోరణాలతో అలంకరించుకున్నారు. ఇంట్లో దీపాలు వెలిగించి రాముడిని స్మరించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



లక్ష్మణచాంద: చామన్‌పల్లి రామాలయంలో..



భైంసా: బాసరలో భక్తుల శోభాయాత్ర



లోకేశ్వరం: ధర్మోరాలో భక్తుల శోభాయాత్ర



సోన్ మండలం న్యూవెల్మల్‌లో ..



కుంటాల రాములోరి ఆలయంలో..



నర్సాపూర్(జి)లో వీక్షిస్తున్న గ్రామస్తులు



కుభీర్‌లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



కుభీర్‌లోని విఠలేశ్వర ఆలయంలో కార్యక్రమం వీక్షిస్తున్న భక్తులు

- లక్ష్మణచాంద మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నర్సాపూర్, చామన్‌పల్లి గ్రామాల్లో ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు.
- ఖానాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీ సీతారామచంద్రస్వామి ఆలయం, మస్కాపూర్ రామాలయంలో పూజలు చేశారు. ఇంద్రానగర్‌లో ఎల్‌ఈడీ తెరల్లో కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్‌నాయక్ పూజలు చేశారు.
- పెంబి మండలంలోని గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.
- లోకేశ్వరం మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. లోకేశ్వరం నుంచి పంచగుడి మీదుగా గొడిసెర వరకు బైక్ ర్యాలీ చేశారు.
- ముధోల్ మండలంలోని గ్రామాలు రామనామ స్మరణతో మారుమోగాయి. అనంతరం పలు ఆలయాల్లో అన్నదానం చేశారు.
- దిలావర్‌పూర్‌తోపాటు గుండంపల్లి, కాల్వ, న్యూలోలం, సిర్గాపూర్, బన్సపల్లి తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద భక్తులు శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేశారు. కర సేవకులైన దిలావర్‌పూర్‌కు చెందిన సంభు భోజారంపాటిల్, కదం గంగాధర్‌పాటిల్, సట్టి పీరన్న, కట్కం రాజేందర్‌రెడ్డిని స్థానిక రామాలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సన్మానించారు. రావుల రాంనాథ్, అంజుకుమార్‌రెడ్డి ఉన్నారు.
- నర్సాపూర్(జి)లోని రామాలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. ఆవరణలో ఎల్‌ఈడీ తెరపై ప్రాణప్రతిష్ఠను వీక్షించారు.
- కడెం మండలంలోని కొండుకూర్, పాండ్వపూర్, బెల్లాల్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు.
- భైంసా మండలంలోని కామోల్, ఇలేగాం, వాలేగాం, కుంసర, మాటేగాం, ఎగ్గాం, వానల్‌పాడ్, పేండ్‌పెల్లి, మహాగాం, సిద్దూర్, మంజ్రి గ్రామాల్లోని ఆలయాల్లో వేడుకలు కొనసాగించారు. ఇలేగాంలో యువకులు బైక్‌ర్యాలీ చేశారు.
- కుంటాల మండలంలోని కల్లూర్‌లో శ్రీరాముడికి 18 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఓలాలో ఎంపీటీసీ కట్ట రవి–సరిత దంపతుల ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు.
- కుభీర్ మండలంలోని బెల్గాం, పల్సి, సొనారి, దార్‌కుభీర్, దొడర్నా తదితర గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు.
- సోన్ మండలంలోని గ్రామాల్లో శ్రీరామనామం మారుమోగింది. పూజలనంతరం బైక్ ర్యాలీ, శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచ్ గంగామణి, స్వామి, సాగర్, మల్లయ్య ఉన్నారు.
- భైంసా పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కిసాన్‌గల్లీ మహదేవ్ మందిరంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెరలో కార్యక్రమం భక్తులతో కలిసి ఎమ్మెల్యే రామారావ్ వీక్షించారు. పులేనగర్ హనుమాన్ ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించారు.
- నిర్మల్‌లోని బ్రహ్మపురి రాంమందిర్, సోమవార్‌పేట్ ఖిల్లా, గుట్ట హనుమాన్ మందిర్, కస్బసునార్ గల్లీ, చింతకుంటవాడ, మంజులాపూర్, భాగ్యనగర్ హనుమాన్ ఆలయం, దేవరకోట వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్లు జై శ్రీరామ్ అంటూ నినాదాలు జపించారు. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పలువురు జై శ్రీరామ్ అంటూ రామనామం జపించారు.
- నిర్మల్‌లోని నాయుడువాడలో హోమం, శ్రీరాముడి ప్రతిమకు అభిషేకం నిర్వహించారు. శ్రీరామ స్తోత్రం, హనుమాన్ చాలీసా పఠనం చేశారు. కౌన్సిలర్ సాదం స్వప్న, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, అరవింద్, పాల్గొన్నారు.
- జిల్లాకేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సీత, రామ, లక్ష్మణ, హనుమంతుడి వేషధారణలో అలరించారు. కరసేవకులు అయ్యన్నగారి భూమయ్య, నాగభూషణం, రామానుజాచార్యులను సన్మానించారు.
- జిల్లా కేంద్రంలోని శాంతినగర్, బాగలవాడ, బ్రహ్మపురి తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూపరిషత్, హిందూవాహిని, హిందూ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు.



భైంసారూరల్: ఇలేగాంలో మహాదేవుని మందిరంలో వీక్షిస్తున్న గ్రామస్తులు



ఖానాపూర్: శ్రీరాంనగర్‌లోని సీతారామాలయంలో భక్తుల పూజలు



ముధోల్‌లో శోభాయాత్ర



తానూరు: ఎల్వి గ్రామంలో భక్తుల భజనలు



దిలావర్‌పూర్ రామాలయ ప్రాంగణంలో..



కడెం రామాలయంలో పూజలో మహిళలు



నిర్మల్‌రూరల్: విజయ ఉన్నత పాఠశాలలో జైశ్రీరాం అక్షరాల రూపంలో విద్యార్థులు



నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో



భైంసాటౌన్: పులేనగర్‌లో దీపాలు వెలిగిస్తూ..



భైంసాలోని పురాణబజార్ రాధాకృష్ణ భవన్‌లో

ఆలయాల్లో పూజలు చేసిన ఎమ్మెల్యే



సారంగపూర్: జామ్‌లో భక్తులతో కలిసి కార్యక్రమం వీక్షిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ హనుమాన్ ఆలయం, చామన్‌పెల్లిలోని రామాలయం, రాచాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి, రావుల రాంనాథ్, రవి, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్, బాగులవాడ, నాయుడువాడ, గాజులపేట్ హనుమాన్ ఆలయాల్లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో బాగులవాడ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, మంజులాపూర్ కౌన్సిలర్ పురస్తు చిన్నయ్య, శంకర్ యాదవ్, రమేశ్ పాల్గొన్నారు.

సారంగపూర్: మండల కేంద్రంలో విద్యార్థులకు అయోధ్య రామాలయంపై క్విజ్, ముగ్గుల పోటీలు, రామాయణం, తదితర అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జామ్, స్వర్ణ, తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. స్వర్ణ, చించోలి(బి)లో అన్నదానం నిర్వహించారు. హిందూవాహిని మండలాధ్యక్షుడు దాసరి ప్రశాంత్, రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నిర్మల్‌లో దీపోత్సవం



శోభాయాత్రలో మంగళహారతులతో భక్తులు

అయోధ్యలో రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధాన వీధుల గుండా రామనామాన్ని స్మరిస్తూ బాగులవాడలో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ప్రియదర్శిని నగర్‌లో

శాంతి కమిటీ సమావేశం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో సోమవారం ఎస్సై హన్మాండ్లు ముస్లిం సోదరులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఐకమత్యంతో ఉండి పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సూచించారు. హైమద్ పాషా, మతపెద్దలు షాదుల్లా, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను సోమవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రా మేనేజ్‌మెంట్ చించోలి వారు పూడ్చివేయించారు. ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ గుంతలతో వాహనదారులకు ఇబ్బంది కలుగుతుందని సీఐ పురుషోత్తంకు తెలుపగా.. వారు వీఎస్ ఇన్స్ ట్రా మేనేజ్‌మెంట్ చించోలికి తెలియజేశారు. దీంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రోడ్లకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎస్సై సాయికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

బోరుకు మోటారు ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలోని భీమన్నదేవుని ఆలయం వద్ద కౌన్సిలర్ నాయిని స్రవంతి ఆధ్వర్యంలో సోమవారం బోరుకు నూతన మోటారు బిగించారు. మోటారు కాలిపోవడంతో కాలనీవాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంతోశ్, భీమేశ్వర్, జావిద్, తదితరులున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

కుంటాల: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మండలంలోని ఓలా ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఆటల పోటీలను ప్రారంభించారు. హెచ్‌ఎం సాజిద్ మిరాజ్, ఎస్‌ఎంసీ చైర్మన్ యూనిస్, హైమద్ పాషా తదితరులు ఉన్నారు.

రక్తహీనతపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యులు

సోన్: ఇంటి వద్ద పండించిన ఆకుకూరలు, కూరగాయలను తినడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని వైద్యులు వెంకటేశ్వర్, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో మిషన్ శక్తి మహిళా అభివృద్ధి, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించి.. రక్తహీనతతో బాధపడతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఉమెన్ జెండర్ ప్రత్యేకాధికారి జ్యోతి, సూపర్‌వైజర్ జ్యోతి, సర్పంచ్ మమత, కార్యదర్శి సంగీత అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులున్నారు.

లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న యువకులు

భైంసాటౌన్: నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అభ్యర్థులు నిరంతరం శ్రమించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్ స్టడీసర్కిల్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. స్థానికంగా కోచింగ్ సెంటర్లు లేక నియోజకవర్గంలోని పేద విద్యార్థులు ప్రభుత్వ కొలువులకు దూరం అవుతున్నారన్నారు. అలాంటివారు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది ప్రభుత్వ కొలువులు పొందిన పలువురు ఎమ్మెల్యేను అయోధ్య రామాలయ నమూనా జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సావ్లి రమేశ్, బి గంగాధర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు భూమన్న, బీవీ రమణారావు, నవీన్, ఎంఈవో సుభాశ్, చంద్రకాంత్, మైసాజీ తదితరులున్నారు.

పాకురెక్కిన నీటి ట్యాంకులు



యూనియన్ బ్యాంకు వద్ద



మ్యాకల నర్సప్ప ఇంటి వద్ద..

కుభీర్: మండల కేంద్రంలోని కాలనీల్లో ఉన్న మినీవాటర్ ట్యాంకులు పాకురెక్కాయి. భగీరథ ప్రధాన పైపుల నుంచి వచ్చే శుద్ధ జలం ఈ ట్యాంకుల్లో చేరుతోంది. ఈ జలాన్నే ప్రజలు తాగునీటిగా వినియోగించుకుంటున్నారు. ట్యాంకుపై కప్పు వేయడంతో నీరు కారి పాకురెక్కుతున్నాయి. దీంతో నీటిని తీసుకెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ట్యాంకులను శుభ్రం చేయాలని వేడుకుంటున్నారు.